సాక్షి
మహబూబాబాద్
మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్
క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే నిందితులను మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. - 8లో▸



డీడీకి పుత్రశోకం
ఐటీడీఏ పరిధిలోని జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎర్రయ్యకు పుత్రశోకం మిగిలింది. ప్రదీప్‌కిరణ్‌కుమార్(31) ఆదివారం రాత్రి అకాల మరణం చెందాడు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
38.2°/24.2°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మున్నేరు వాగుకు జలకళ



డోర్నకల్: డోర్నకల్ సమీపంలోని మున్నేరు వాగుకు జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడడంతో చెక్‌డ్యాం పైనుంచి నీరు ప్రవహిస్తోంది. మండుటెండలో మున్నేరు నిండుగా ప్రవహిస్తుండడంతో రైతులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాలి



మహబూబాబాద్ అర్బన్: వేసవి సెలవుల్లో పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా విద్యాశాఖ ప్రతినిధి సదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించగా సదయ్య హాజరై మాట్లాడారు. సెలవుల్లో పిల్లలను చెరువులు, బావుల వద్దకు వెళ్లనివ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. వారికి ద్విచక్ర వాహనాలను ఇవ్వద్దన్నారు. అనంతరం విద్యార్థుల వార్షిక పరీక్షల ఫలితాల ప్రగతి నివేదికను తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మురళి, ఉపాధ్యాయులు వాసుదేవ్, శ్రీరామ్, వెంకన్న, మాధవి, ప్రతిభ, లత, భారత్ వ్యాస్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నమ్మకద్రోహి సీఎం కేసీఆర్



నెల్లికుదురు: సీఎం కేసీఆర్ మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తూ.. రైతులకు నమ్మకద్రోహిగా నిలిచారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మునిగలవీడులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తోందన్నారు. ప్రతీ కేంద్రం వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుమార్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పాపారావు, ఎంపీటీసీ శోభ, బీజేవైఎం జిల్లా కార్యదర్శి సురేందర్, శివసాయిగౌడ్, యుగంధర్, శ్రీను పాల్గొన్నారు.

డీజీపీ వీడియో కాన్ఫరెన్స్



మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్రైమ్ రివ్యూ నిర్వహించారు. జిల్లా నుంచి ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు రఘు, రమణబాబు, డీపీఓ ఏఓ జయరాం, డీసీఆర్బీ సీఐ బాలాజీ వరప్రసాద్, ఆర్‌ఐ పూర్ణచందర్ వీసీకి హాజరయ్యారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు



పెద్దవంగర: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ రఘు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ సత్యనారాయణ, ఎస్సై రాజుతో కలిసి డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు, ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు, చల్లని తాగునీటిని అందించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ జ్యోతిర్మయి, నాయకులు రామచంద్రయ్య శర్మ, ఈదురు ఐలయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్, రవి, రాజు, సుధీర్, లింగమూర్తి, ఏఐఎస్సై విజయ రాజు, కొయ్యడ సురేష్, హీర్యా నాయక్, బాలాజీ నాయక్, రాంనారాయణ, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయటకే..!

- అంగన్‌వాడీల్లో కనిపించని మరుగుదొడ్లు
- ఒంటికి, రెంటికి చిన్నారులకు తప్పని తిప్పలు



తొర్రూరు మండలం చింతలపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

తొర్రూరు: వందశాతం మరుగుదొడ్ల నిర్మాణమే లక్ష్యంగా జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కానీ చిన్నారులు ఉండే అంగన్‌వాడీ కేంద్రాలను మాత్రం విస్మరిస్తోంది. దీంతో చిన్నారులు ఒంటికి, రెంటికి ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని 70శాతం అంగన్‌వాడీల్లో మరుగుదొడ్లు లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

చిన్నారులపై చిన్నచూపు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలపై అధికారులు పెద్దగా దృష్టిసారించడం లేదు. దీంతో చిన్నారులకు బహిరంగ మల, మూత్ర విసర్జన తప్పడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు వారి పూర్తి రక్షణను ఐసీడీఎస్ అధికారులే చూసుకోవాలి. కానీ మరుగుదొడ్ల లేమితో చిన్నారులతో పాటు ఉపాధ్యాయులు, ఆయాలు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు పూర్తి స్థాయిలో లేవు. అరకొరగా ఉన్నా.. అవి వినియోగానికి నోచుకోవడం లేదు. మరుగుదొడ్లు ఉన్నచోట్ల నీటి సౌకర్యం లేదు.. మరికొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో చిన్నారులు బహిర్భూమికి వెళ్లడం కోసం నానా అవస్థలు పడుతున్నారు.

కనిపించని మరుగుదొడ్లు..

జిల్లాలోని 16 మండలాల్లో 1,437 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 40,261మంది చిన్నారులు అభ్యసిస్తున్నారు. వీరితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పని చేస్తున్నారు. అరకొరగా ఉన్న అద్దె భవనాల్లో మరుగుదొడ్లు ఉన్నాయి. ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో ఎక్కడా మరుగుదొడ్లు లేకపోవడం గమనార్హం. ఓ వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ నినాదంతో పయనిస్తుంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రం అది తమకు పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా చిన్నారులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్లపైకి పరుగులు తీస్తున్నారు. కాగా ఇటీవల నిర్మించిన భవనాల్లో సైతం మరుగుదొడ్లు లేవు. కాగా చాలాచోట్ల సౌకర్యాలు లేకపోవడంతో చిన్నారుల సంఖ్య సైతం తగ్గిపోతుంది. ఈ విషయాన్ని గమనించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

జిల్లాలోని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు	1,285
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	152
అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు	40,261
గర్భిణులు	5,993
బాలింతలు	5,269
సొంత భవనాలు	319
అద్దె భవనాలు	568
అద్దె లేని భవనాలు(ప్రైవేటు)	550

మరుగుదొడ్లు నిర్మించాలి



మరుగుదొడ్లు లేక పిల్లలు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. పిల్లలను బయటకు తీసుకువెళ్లాలంటే జాతీయ రహదారి దాటాల్సి వస్తుంది. అధికారులు సమస్య పరిష్కరించాలి.

-జె.లలిత, అంగన్‌వాడీ టీచర్, తొర్రూరు

ఉన్నతాధికారులకు నివేదించాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల సమస్య ఉన్నది వాస్తవమే. అన్ని చోట్ల సమస్య ఉంది. అంగన్‌వాడీ టీచర్లు మా దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. అధికారుల నుంచి ఆదేశాలు వస్తే మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతాం.

- హైమావతి, సీడీపీఓ, తొర్రూరు

మినీ ప్లీనరీకి వేళాయె..

- నేడు అన్ని నియోజకవర్గాల్లో నిర్వహణ
- ప్రతీ చోట మూడువేలకు తగ్గకుండా జన సమీకరణ
- మటన్, చికెన్‌తో భోజనాలు
- గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలని బీఆర్‌ఎస్ అధినాయకత్వం ఆదేశం



మహబూబాబాద్ నియోజకవర్గ ప్లీనరీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

సాక్షి, మహబూబాబాద్: ఎన్నికల సంవత్సరం కావడంతో బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని పార్టీ అధినేత, సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. ఈనెల 27న హైదరాబాద్‌లో జరిగే పార్టీ ప్లీనరీ సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రతీ నియోజకవర్గంలో ఈనెల 25వ తేదీన(మంగళవారం) మినీ ప్లీనరీలు జరపాలని పార్టీ అధినేత ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

గ్రామాల్లో జెండా పండుగ..

మంగళవారం నియోజకవర్గాల్లో జరిగే మినీ ప్లీనరీకి ముందుగా ఉదయాన్నే అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలని పార్టీ అధినాయకత్వం ఆదేశించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 461 గ్రామ పంచాయతీలు, మహబూబాబాద్ మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో, డోర్నకల్ 15, మరిపెడ 15, తొర్రూరు మున్సిపాలిటీలోని 16వార్డుల్లో జెండా పండుగ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందు కోసం ఏ నియోజకవర్గానికి ఆ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పార్టీ గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో మాట్లాడారు. జెండా గద్దెలు లేని చోట్ల ఏర్పాటు, జెండా, పోలు మొదలైనవి అందించారు. జెండా పండుగ అనంతరం మధ్యాహ్నం వరకు నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే మినీ ప్లీనరీకి హాజరయ్యే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

ఏర్పాట్లు ఇలా..

బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవానికి రెండు రోజుల ముందుగానే నియోజకవర్గాల్లో మినీ ప్లీనరీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ నియోజకవర్గ ప్లీనరీ కోసం ఆర్తీ గార్డెన్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి పర్యవేక్షించారు. అదేవిధంగా డోర్నకోల్ నియోజకవర్గ ప్లీనరీని మరిపెడలో నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ రెండు నియోకవర్గాల్లో మూడు వేలకు తగ్గకుండా నాయకులు, కార్యకర్తలు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా పాలకుర్తి నియోకవర్గ ప్లీనరీ దేవరుప్పులలో, ములుగు ప్లీనరీ ములుగులో, ఇల్లెందు నియోజకవర్గ ప్లీనరీ ఇల్లెందులో ఏర్పాటు చేశారు. కాగా జిల్లాలోని తొర్రూరు, పెద్దవంగర మండలాల నాయకులు జెండా పండుగ జరుపుకొని దేవరుప్పులకు, గంగారం, కొత్తగూడ మండలాల నాయకులు ములుగుకు, బయ్యారం, గార్ల నాయకులు ఇల్లెందుకు బయల్దేరి వెళ్లనున్నారు. ప్లీనరీకి హాజరయ్యే వారికి మధ్యాహ్న భోజనంలో మటన్, చికెన్‌తో వడ్డించనున్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది



మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మహబూబాబాద్ రూరల్: గుండె కొట్టుకోవడం ఆగినప్పుడు లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు వెంటనే చేపట్టాల్సిన సీపీఆర్‌పై ప్రతి పోలీస్ అధికారి అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం, మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సీపీఆర్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కార్డియాక్ అరెస్ట్ వల్ల మరణాల సంఖ్య పెరిగిపోవడంతో దీనిపై స్పందించి సీపీఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రస్తుత రోజుల్లో సీపీఆర్ ప్రక్రియపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. నిరంతరం ప్రజల మధ్య విధులు నిర్వహించే పోలీసులకు ఈ ప్రక్రియ అవగాహన ఉండాలని సూచించారు.

బాధితులకు అండగా ఉంటాం

బాధితులకు అండగా ఉంటామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై ఆయా పోలీస్ స్టేషన్‌ల అధికారులు బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై, మహిళలకూ వ్యతిరేకంగా జరిగే నేరాలపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు.

పెండింగ్ వినతులు పరిష్కరించాలి

- కలెక్టర్ శశాంక



కలెక్టర్ శశాంకకు వినతులు అందజేస్తున్న దరఖాస్తుదారులు

మహబూబాబాద్: పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు డేవిడ్, అభిలాష అభినవ్ వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ వినతిపై అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల కారణంతో కూడిన నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో 98 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామ శివారు పంతులుతండా, జామతండాకు చెందిన సుమారు వంద మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్య పరిష్కరించాలని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ సుమారు 250 మంది రైతులు అసైన్డ్ భూముల్లో కొన్ని దశాబ్దాలుగా సాగు చేస్తున్నారన్నారు. వారికి రైతు బంధు, రైతుబీమా పథకాలు వర్తించకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
- అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో వినతి అందజేశారు. ఇల్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)ప్రజాపంథా ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి పాలెం చంద్రన్న, పైండ్ల యాకయ్య తదితరులు ఉన్నారు.
- మోడల్ స్కూల్, కాలేజీ హాస్టల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యం, నాయకులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలు లేనట్టేనా..?

- వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటులో నిర్లక్ష్యం
- సెలవుల నిమిత్తం ఊళ్లకు వెళ్తున్న చిన్నారులు
- కదలిక లేని సమ్మర్ క్యాంపులు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా క్రీడలకు పుట్టినిల్లులాంటిది. ఈ ప్రాంతం నుంచి అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు. అనేక మంది క్రీడాకారులు కేంద్ర, రాష్ట్ర సర్వీసుల్లో ఉద్యోగాలు సాధించారు. ఇలాంటి చరిత్ర ఉన్న జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటులో నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో వేసవి సెలవులు రావడంతో చిన్నారులు సొంతూళ్లకు, విహారయాత్రలకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

ఏటా శిబిరాలు..

జిల్లాలో ఏటా జిల్లా క్రీడలు, యువజన శాఖ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం శిబిరాల ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. కాగా వేసవి సెలవులు రావడంతో పిల్లలు పల్లెల బాట పడుతున్నారు. శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తే నెల రోజుల పాటు చిన్నారులు శిక్షణ తీసుకొని ఆటల్లో రాణించేవారు. అలాగే వారి శారీరక, మానసిక దృక్పథంలో మార్పులతో పాటు కండరాలు, ఎముకల పెరుగుదల, రక్తప్రసరణ, మెదడు, గుండె చక్కగా పని చేస్తాయి. ఇలాంటి ఎన్నో ప్రయోజనాలు ఉన్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రారంభించాలని పిల్లల తల్లిదండ్రులు, పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.

సమ్మర్ క్యాంప్‌లో క్రీడలివే.

మున్సిపల్ పరిధిలోని సమ్మర్ క్యాంప్‌లో బాస్కెట్ బాల్, త్వైకాండో, క్రికెట్, అథ్లెటిక్స్, హాకీ, స్విమ్మింగ్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్ తదితర క్రీడలు నిర్వహిస్తారు. అలాగే గ్రామాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్ క్రీడలు నిర్వహిస్తారు.

క్రీడలతో పిల్లల్లో ఎదుగుదల..



క్రీడలకు పుట్టినిల్లు మానుకోట. క్రీడలతో చిన్నారుల్లో మానసిక, శారీరక ఎదుగుదల ఉంటుంది. ఈ వేసవి సెలవుల్లో పిల్లలకు క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలి. క్రీడల అభివృద్ధికి కృషి చేయాలి. వేసవిలో నిర్వహించే క్రీడా క్యాంపులు, శిబిరాలపై ఇప్పటి వరకు ఎలాంటి కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించలేదు. అధికారులు స్పందించి వేసవి శిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- బొద్దుపల్లి ఉపేంద్రం, మాజీ సీనియర్ ఖోఖో కోచ్

శిబిరాలు నిర్వహించేలా చర్యలు



రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం త్వరలోనే మండలాల వారీగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తాం. ఆసక్తి గల క్రీడా కోచ్‌లు జిల్లా క్రీడల, యువజన కార్యాలయంలో సంప్రదించాలి.


-అనిల్, జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి

దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి

- డీడబ్ల్యూఓ వరలక్ష్మి

మహబూబాబాద్: దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో భాగంగా కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఈనెల 26న ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీడబ్ల్యూఓ వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో పాల్గొని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

ఆరోగ్య సమస్యలపై అప్రమత్తం చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

తొర్రూరు: ఆరోగ్య సమస్యలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గుండాల మురళీధర్ అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో కంటి, చెవి, నోటి సమస్యలు ఉన్నవారిని గుర్తించాలని, వారికి చికిత్స అందేందుకు వైద్యాధికారులకు సమాచారం అందించాలన్నారు. అత్యవసర సమయాల్లో ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మీరాజ్, జ్వలిత, ఇన్‌చార్జ్ డీపీహెచ్‌ఎన్ మంగమ్మ, సీహెచ్‌ఓ రుద్రపతి విజయ్‌కుమార్, పీహెచ్‌ఎన్ మెరీనా, ఎస్‌యూఓ యాకయ్య, ఆరోగ్య సిబ్బంది రత్నకుమారి, హేమలత, అన్నామేరీ, జయమణి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి బుధవారం మార్కెట్ బంద్



వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని రైతులు, వ్యాపారులు, గుమస్తాలు, దడువాయిలు, కార్మికుల ఆరోగ్యంతో పాటు ఎండ తీవ్రతలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ చాంబర్ అండ్ ఇండస్ట్రీ వినతి మేరకు ప్రతి బుధవారం మార్కెట్ బంద్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26నుంచి జూన్ 16వ తేదీ వరకు ప్రతి బుధవారం మార్కెట్ యార్డు బంద్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ రోజుల్లో రైతులు వ్యవసాయ ఉత్పత్తులు తెచ్చి ఇబ్బందులు పడవద్దని ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- డీఈఓ రామారావు



మరిపెడలో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

దంతాలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఈఓ రామారావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. ఈ వేసవిలో పిల్లలు సమయాన్ని వృథా చేయకుండా పైతరగతుల పుస్తకాలు చదవాలని సూచించారు. అనంతరం 6నుంచి 9వ తరగతి విద్యార్థులకు వార్షిక ప్రగతి నివేదిక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రాధానోపాధ్యాయులు శ్రీనివాస్, బ్రహ్మానందరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రేణుకాదేవి, యాకూబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను సిద్ధం చేయాలి..

మరిపెడ: వచ్చే విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివే విద్యార్థులను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని డీఈఓ రామారావు సూచించారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని సీతారాంపురం పాఠశాలలో సోమవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. జిల్లాలోనే సీతారాంపురం పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాధురి, విజయలక్ష్మి, శ్రీనివాస్, రామ్మోహన్, వెంకటేశ్వర్లు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో సంచినిండా సరుకులు

- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క



హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లో గజమాలతో భట్టికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 39వ రోజు సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ నుంచి ప్రారంభమై కానిపర్తి, శంభునిపల్లి, ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి, ఆరేపల్లి, బావుపేట క్రాస్‌రోడ్ నుంచి హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్, హసన్‌పర్తిల మీదుగా కాకతీయ యూనివర్సిటీ వరకు సాగింది. రాత్రి హసన్‌పర్తిలో జరిగిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

– కమలాపూర్/ఎల్కతుర్తి

- 8లో▸

క్లుప్తంగా

నేటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు మంగళవారం నుంచి మే 4 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు టైంటేబుల్ ప్రకారం రోజు రెండు సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2–30 నుంచి సాయంత్రం 5–30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పదో తరగతి పరీక్షలు ఉదయం , మధ్యాహ్నం ఉంటాయి. అలాగే ఇంటర్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఉంటాయి. సబ్జెక్టుల ప్రకారం ఏ సమయంలో ఉంటే ఆ సమయంలో పరీక్షలకు హాజరవుతారు. నిర్దేశించిన సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ డీఈఓ ఎండీ. అబ్దుల్‌హై , ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.శంకర్‌రావు సోమవారం తెలి పారు. ఇంటర్‌లో ఆరు జిల్లాలు కలిపి 4,518 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. టెన్త్ పరీక్షలకు 2,567 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు.

ఆత్మహత్యకి ప్రేరేపించిన వ్యక్తికి జైలు

ములుగు రూరల్(గోవిందరావుపేట): ఆత్మహత్యకి ప్రేరేపించిన వ్యక్తికి జైలుశిక్ష విధిస్తూ ములుగు అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి మాధవి సోమవారం తీర్పునిచ్చారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ గ్రామానికి చెందిన యువతి, అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెండు సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. పెద్దల సమక్షంలో యువతి చదువు పూర్తయిన తర్వాత వివాహం చేసుకుంటానని ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో తన చెల్లితో శ్రీకాంత్ మాట్లాడడాన్ని గమనించిన అక్క మందలించింది. మనసులో పెట్టుకున్న శ్రీకాంత్ మరుసటి రోజు యువతి ఇంటికి చేరుకొని నీవు చనిపోతే సమస్యలు పరిష్కారమవుతాయని గట్టిగా అనడంతో మనస్థాపానికి గురైన యువతి ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి తల్లి ఈక సరోజన 2018 డిసెంబర్ 09న అప్పటి ఎస్సై మహేందర్ కుమార్‌కు ఫిర్యాదు చేసింది. శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి చార్జిషీట్ ఫైల్ చేశారు. సోమవారం ఏపీపీ సత్యనారాయణ వాదనలతో ఏకీభవించిన అసిస్టెంట్, సెషన్ కోర్టు జడ్జి మాధవి శ్రీకాంత్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించింది.

కాంగ్రెస్ హయాంలో సంచినిండా సరుకులు

- బీజేపీ పాలనలో మాయం
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- కాకతీయ యూనివర్సిటీలో రాత్రి బస

కమలాపూర్/ఎల్కతుర్తి: కాంగ్రెస్ హయాంలో రేషన్ షాపుల్లో నిరుపేదలకు సంచినిండా సరుకులిస్తే, బీజేపీ ప్రభుత్వంలో అవన్నీ మాయమయ్యాయని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 39వ రోజు సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ నుంచి ప్రారంభమై కానిపర్తి, శంభునిపల్లి, ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి, ఆరేపల్లి, బావుపేట క్రాస్‌రోడ్ నుంచి హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్, హసన్‌పర్తిల మీదుగా కాకతీయ యూనివర్సిటీ వరకు సాగింది. రాత్రి యూనివర్సిటీలో బస చేశారు. ముందుగా కానిపర్తిలో వరి కోతలు కోస్తున్న మహిళా కూలీలు రజిత, సరోజనలతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. శంభునిపల్లి బ్రిడ్జిపై వరి ధాన్యం ఆరబోసిన మోడెం సంధ్యారాణితో మాట్లాడారు. వడ్లు బాగా ఎండితేనే కొంటామని కొనుగోలు కేంద్రాల్లో చెబుతున్నారని, ఇటీవల కురిసిన అకాల వర్షానికి 250 బస్తాల వడ్లన్నీ తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేసింది. మహిళా రైతుకు చేయూతగా ఆమె ఆరబోసిన వరి ధాన్యాన్ని కాసేపు భట్టి తిరగేశారు. శంభునిపల్లికి చెందిన రైతు కట్కూరి తిరుపతిరెడ్డితో మాట్లాడారు. కానిపర్తి శివారులోకి చేరుకోగానే ఓ గీత కార్మికుడు తెచ్చిన ముంజలను భట్టితోపాటు నాయకులు ఆరగించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క గౌడన్నల మోకు, ముత్తాదు ధరించి గీత కార్మికుడు స్వామిని శాలువాతో సన్మానించారు.



కమలాపూర్ : శంభునిపల్లి వద్ద వరి ధాన్యం తిరగబోస్తున్న భట్టి విక్రమార్క

యాత్ర 400 కిలోమీటర్లు పూర్తి

యాత్ర 400 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్కతుర్తి మండలం గుంటూర్‌పల్లి వద్ద కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. బావుపేట గ్రామంలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయనున్నట్లు వెల్లడించారు. బీసీ సబ్‌ప్లాన్ తీసుకువస్తామని చెప్పారు. ఇటీవల కురిసిన గాలివానకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఆంక్షలు విధించకుండా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, నాయకులు కవ్వంలపల్లి సత్యనారాయణ, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ఫక్రుద్దీన్, చరణ్‌పటేల్, బాలసాని రమేష్‌గౌడ్, నాయకులు మేడిపల్లి సత్యం, తొటం రవీందర్, అయిలయ్య, పోడేటి భిక్షపతి, కనుకరత్నం, సముద్రాల కృష్ణ, సాంబయ్య, వెంకట్, నీలిమా, అన్వేష్‌రెడ్డి, సుకినె సంతాజీ, ఇంద్రసేనారెడ్డి, దాట్ల రాముడు, మాల్లారెడ్డి, ముప్పు మహేందర్, మండ సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.



ఎల్కతుర్తి మండలం బావుపేటకు చేరుకున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భట్టివిక్రమార్క

తెలంగాణ సంపదను దోచుకుంటున్న కేసీఆర్ కుటుంబం

హన్మకొండ చౌరస్తా: బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి కేసీఆర్ కుటుంబం రాష్ట్ర సంపదను దోచుకుంటుందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. హసన్‌పర్తి వద్ద ఏర్పాటు చేసిన కార్నర్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఎక్కడా డబుల్‌బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్ సిలిండర్ రూ.500లకే పంపిణీ చేస్తామని, అమ్మహస్తం పథకం పునరుద్ధరించి రేషన్ దుకాణాల ద్వారా 9 సరుకులు పంపిణీ చేస్తామన్నారు.

వైద్య విద్యార్థుల బయోమెట్రిక్ షురూ

- రెండే పరికరాల ఏర్పాటుతో గందరగోళం
- హాజరు శాతం నమోదు చేసేందుకు ఇబ్బందులు

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న అన్ని బోధనాస్పత్రుల్లో సోమవారం నుంచి బయోమెట్రిక్ హాజరుశాతాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. క్లినికల్ సేవలందిస్తున్న వైద్య విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపర్చడం, వారిపై ప్రత్యేక దృష్టి సారించేందుకు రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వం కేఎంసీని ఎంచుకుంది. ఈక్రమంలో వందలాది మంది విద్యార్థులు హాజరయ్యే ఎంజీఎంలో రెండే పరికరాలను ఏర్పాటు చేయడం గందరగోళానికి దారి తీసింది. ఉదయం 9 గంటలకు ప్రతీ విద్యార్థి తమ బయోమెట్రిక్ హాజరు వేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఎంజీఎం ఆర్ఎంఓ కార్యాలయానికి ఎదురుగా ఉన్న గదిలో బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేశారు. హాజరు నమోదు చేసుకోవడానికి వచ్చిన వైద్య విద్యార్థులకు బయోమెట్రిక్ ఎక్కడుందో తెలియక కొద్దిసేపు ఇబ్బంది పడగా.. పరికరాలు ఏర్పాటు చేసిన గదికి తాళం వేసి ఉన్న విషయాన్ని గుర్తించారు. ఈ గది తాళం 10 గంటల వరకు తెరవకపోవడంతో వందలాది మంది విద్యార్థుల హాజరు శాతం నమోదు చేసేందుకు పరిపాలనా కార్యాలయం వద్ద ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే.. కొందరు విద్యార్థులను బయోమెట్రిక్ పరికరం గుర్తించలేదు. ఈ విషయంపై ఎంజీఎం పరిపాలన అధికారులను వివరణ కోరగా.. లోపాలను సరి చేసి విద్యార్థులకు అనుకూలంగా బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేస్తామని అధికారులు స్పష్టం చేసారు.



నమోదు చేసేందుకు గుమిగూడిన వైద్య విద్యార్థులు

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో నలుగురు
- నాలుగు ఫోన్లు, రూ. 5.50 లక్షల నగదు స్వాధీనం

మహబూబాబాద్ రూరల్ : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్, టౌన్ పోలీసులు గత కొన్ని రోజులుగా క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం పక్కా సమాచారంతో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే నలుగురి నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి నాలుగు ఫోన్లు, రూ. 5.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. బెట్టింగ్‌లో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏలూరు జిల్లాకు చెందిన వలగాని రామకృష్ణ, ఖమ్మం వాసి తొట్టెంపూడి విక్రమ్, చార ప్రవీణ్ కుమార్, గుంటూరుకు చెందిన ఆనంద్ కిరణ్ కలిసి మహబూబాబాద్ పట్టణంలో బెట్టింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. యువత బెట్టింగ్‌ను ప్రోత్సహించే విధంగా ప్రచారం చేస్తూ పట్టుబడ్డారన్నారు. వీరు బుకీలుగా వ్యవహరిస్తూ చైన్ లింకింగ్ సిస్టం ద్వారా బెట్టింగ్ ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, తెలంగాణలోని మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో వీరు బెట్టింగ్ టీంలను ఏర్పాటు చేశారన్నారు. ఈ క్రమంలో మహబూబాబాద్‌లో బెట్టింగ్‌లు వాళ్లకు నచ్చిన జట్టు మీద బెట్టింగ్ కాసి వలగాని రామకృష్ణ వీరు చెప్పిన జట్టు మీద ఎంత డబ్బులు బెట్టు పెట్టారో నోట్‌బుక్ లో నోట్ చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. బెట్టింగ్‌కు సంబంధించిన నగదును ఆన్‌లైన్ ద్వారా ముందుగానే తీసుకోవడం, మ్యాచ్ అనంతరం గెలిచిన వారికి నగదును ఆన్‌లైన్ ద్వారానే బదిలీ చేయడం జరుగుతుందని తెలిపారు. గత కొంతకాలంగా మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల పరిధిలో విక్రమ్, ప్రవీణ్ కుమార్, ఆనంద్ కిరణ్ బెట్టింగ్ చేస్తూ, బెట్టింగ్‌ను ప్రోత్సహించడం చేస్తున్నారని తెలిపారు. అరెస్టు చేసిన వారిలో వలగాని రామకృష్ణ, తొట్టెంపూడి విక్రమ్, ఆనంద్ కిరణ్, దార ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. క్రికెట్ బెట్టింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని మహబూబాబాద్ పోలీసులకు వాట్సాప్ నంబర్ 8712656999లో తెలియజేయాలన్నారు. సమాచారం సేకరించి నేరస్తులను పట్టుకున్న మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు సంతోష్, రమేష్ బాబు, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, రామకృష్ణ, దిలీప్, వీరస్వామిలను జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించి, రివార్డులు అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్

మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణ

- 24 గంటల్లో నిందితుడి పట్టివేత
- పోలీసులకు ఏసీపీ శ్రీనివాస్ అభినందన

కాజీపేట: ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును అపహరించిన నిందితుడిని 24 గంటల్లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పి.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 63వ డివిజన్ విష్ణుపురి కాలనీకి చెందిన ములుగు దేవేంద్ర ఈ నెల 22న ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటిపక్కనే ఉండే యాదగిరి సురేష్ గొలుసు అపహరించి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా సురేష్‌పై అనుమానం వేసి విచారించగా నేరం చేసినట్లుగా అంగీకరించి గొలుసును అప్పగించాడన్నారు. చోరీ జరిగిన వెంటనే స్పందించి నిందితుడిని గుర్తించిన సీఐ సార్ల రాజు, ఎస్సై ప్రమోద్‌కుమార్, క్రైం కానిస్టేబుల్ బి.భాస్కర్, కమలాకర్‌లను ఏసీపీ అభినందించారు. త్వరలో సీపీ డాక్టర్ ఏవీ రంగనాథ్ చేతుల మీదుగా రివార్డు ఇవ్వనున్నట్లు ఏసీపీ వివరించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్సైలు మాచర్ల శ్వేత, ప్రమోద్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ శ్రీనివాస్

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

- ఆరుగురు కూలీలకు గాయాలు

దంతాలపల్లి: ఆటో వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో ఆరుగురు కూలీలకు గాయాలైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, క్షతగాత్రుల కథనం ప్రకారం ..తొర్రూరు మండలం చింతలపల్లికి చెందిన రాజబోయిన దూడాలు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దినచర్యలో భాగంగా అదే గ్రామానికి చెందిన 15 మంది వ్యవసాయ కూలీలు ఆటోను అద్దెకు తీసుకొని మరిపెడ మండలం వీరారం గ్రామ సమీపంలో మిరుపకాయలు ఏరటానికి వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి వస్తున్న క్రమంలో నెల్లికుదురు మండలం బ్రాహ్మణకొత్తపల్లికి చెందిన తాళ్ల యాకయ్య తన బైక్‌తో వ్యక్తిగత పనిపై దంతాలపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి కూలీలతో ఆటో వస్తుంది. ఈ క్రమంలో రోడ్డుపై ఆగి ఉన్న ఇన్నోవా వాహనం తప్పించబోయి వాహనదారుడు రోడ్డు పైకి రావడంతో వెనుక నుంచి వచ్చి ఆటో ఢీ కొనడంతో ఆటో పల్టీ కొట్టింది. కె రాధిక, నాగుల బోయిన గంగ, ఏర్పుల సోమలక్ష్మి, కొండూరి పిచ్చమ్మ, కొండూరి పద్మ, కమటం సామ్రాజమ్మలకు గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై కూచిపుడి జగదీష్ 108 వాహనంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సైని అడుగగా ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

రామన్నపేట : రాత్రి సమయంలో నగరంలో పార్క్ చేసిన వాహనాలను దొంగిలిస్తున్న దొంగను ఇంతేజార్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రతిరాంతండాకు చెందిన గుగులోత్ నవీన్ తొర్రూర్‌లో ఒక కాలేజీలో చదువుతున్నాడు. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేయడం ప్రారంభించాడన్నారు. ఇలా రాత్రి సమయంలో వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను కీ లేకుండా స్టార్ట్ చేసి తీసుకెళ్లి వాటన్నింటిని ఒకేసారి అమ్మాలని వరంగల్ రైల్వేస్టేషన్ పార్కింగ్ ఏరియాలో దాచిపెట్టేవాడని తెలిపారు. ఇలా అమ్మడానికి ఇద్దరిని సంప్రదించి బేరం కుదుర్చుకున్నాడని ఏసీపీ తెలిపారు. సోమవారం ఇంతేజార్‌గంజ్ పోలీసులు జరిపిన వాహనాల తనిఖీల్లో అనుమానంగా కనిపించిన నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ మల్లేష్, ఎస్సై నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు శివ, ఉపేందర్, రాజశేఖర్, ఏఏఓ సల్మాన్‌లను ఏసీపీ అభినందించారు.

మహబూబాబాద్ డీడీకి పుత్రశోకం



నివాళులర్పిస్తున్న ములుగు కలెక్టర్ కృష్ణ ఆదిత్య



పరామర్శిస్తున్న కలెక్టర్ శశాంక, పీఓ అంకిత్

- గుండెపోటుతో తనయుడి మృతి



ప్రదీప్‌కిరణ్ కుమార్ (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి/ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని మహబూబాబాద్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మంకిడి ఎర్రయ్యకు పుత్రశోకం మిగిలింది. మంకిడి ప్రదీప్‌కిరణ్‌కుమార్(31) ఆదివారం రాత్రి అకాల మరణం చెందాడు. హనుమకొండలోని గోపాలపురంలో ఎర్రయ్య కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి కుమారుడు ప్రదీప్‌కు ఛాతిలో నొప్పి వస్తుందని కుప్పకూలిపోయాడు. సీపీఆర్ చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ప్రదీప్ ఇంట్లోనే ఉండి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ప్రదీప్‌తోపాటు మరో కుమారుడు, కుమార్తె ఉంది. చేతికి అందిన పెద్ద కుమారుడు మృతి చెందడంతో ఎర్రయ్య కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

నర్సాపూర్‌లో అంత్యక్రియలు

మహబూబాబాద్ డీడీ మంకిడి ఎర్రయ్య కుమారుడు ప్రదీప్‌కిరణ్‌కుమార్ మృతి చెందగా ఆయన స్వగ్రామమైన తాడ్వాయి మండలం నర్సాపూర్ (పీఏ) గ్రామానికి సోమవారం ఉదయం తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపించారు. ములుగు, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు కృష్ణ ఆదిత్య, శశాంక, ఏటూరు నాగారం ఐటీడీఏ పీఓ అంకిత్‌లు భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే జెడ్పీ వైస్‌చైర్మన్ బడే నాగజ్యోతి, డీఎంహెచ్ఓ అప్పయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగస్తులు, ఐటీడీఏ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి పరామర్శించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

కురవి : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం సీరోలు మండలం చింతపల్లి శివారు భూక్యతండాలో చోటు చేసుకుందని సీరోలు ఎస్సై ఎల్.నరేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..భూక్య తండాకు చెందిన మాజీ సర్పంచ్ సాంక్రియా నాయక్ పెద్దకుమారుడు భూక్య వెంకన్న(45) కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన వివరించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తండాకు చేరుకుని సాంక్రియానాయక్‌ను, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, ఎంపీటీసీ బోజ్యానాయక్, మాజీ ఎంపీటీసీ చందూలాల్, మాజీ సొసైటీ చైర్మన్ బీకోజీనాయక్, నాయకులు మామిళ్ల వెంకన్న, బాలాజీ, నరహరి, ఉపసర్పంచ్ జేరిపోతుల రంగన్నగౌడ్, దేవ్‌సింగ్, పత్తిసింగ్ ఉన్నారు.

అదృశ్యమైన వ్యక్తి... శవమై కనిపించాడు



సాయిలు (ఫైల్)

కేసముద్రం: ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన ఓ వ్యక్తి..చెరువులో శవమై కనిపించిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తికి చెందిన కొమ్మనబోయిన సాయిలు(48) ఓ రైతు వద్ద జీతం ఉన్నాడు. అయితే బావిలో మునిగిన విద్యుత్ మోటార్లను తీసే గజ ఈతగాడిగా సాయిలుకు మంచి పేరుంది. ఈనెల 21న భార్య నాగమ్మ పనికి వెళ్లగా, ఆ తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయిలు తిరిగి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఇనుగుర్తి గ్రామశివారు గుంటి చెరువులో మత్తడివైపునకు సాయిలు మృతదేహం తేలి ఉండగా అటుగా వెళ్లిన ఓ వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు చెరువువద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని, మృతదేహన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాయిలు చెరువులో శవమై కనిపించడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

చివరి రోజు సరుకులు మాయం

గూడూరు: వేసవి సెలవుల దృష్ట్యా పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పాఠశాలలో మిగిలిన సరుకులను ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది తీసుకెళ్తూ గ్రామస్తులకు పట్టుబడిన సంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వెసవి సెలవుల దృష్ట్యా మంగళవారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. దీంతో ఆశ్రమంలో మిగిలిన సరుకులను గుర్తించి రిజిస్టర్‌లో రాసి వెళ్లాలి. కానీ ఈ పాఠశాలలో మాత్రం అందులో పనిచేసిన సిబ్బంది ప్రిన్సిపాల్‌తో, తిరిగి పాఠశాల ప్రారంభమయ్యే వరకు మిగిలిన సరుకులు పురుగులు పట్టి పాడవుతాయి. మిగిలిన పప్పులు పని చేసిన తమకు అరకిలో చొప్పున ఇవ్వమన్నారు. దీంతో ప్రిన్సిపాల్ వసంత మిగిలిన 5 కేజీల పప్పును సిబ్బందికి ఇచ్చింది. మిగతా సరుకులను తమ బ్యాగ్‌లో పెట్టుకొని పాఠశాలకు తాళం వేసి బయలుదేరారు. ఈ దృశ్యాన్ని ముందుగా తెలుసుకున్న గ్రామస్తులు గేటు ఎదురుగా ఉండి వీడియో తీయడం గుర్తించిన ప్రిన్సిపాల్ సరుకులను వదిలేసి వెళ్లింది. ఈ సంఘటనపై ప్రిన్సిపాల్ వసంతను వివరణ కోరగా సిబ్బంది అడిగితే ఇవ్వడం జరిగిందన్నారు. సిబ్బంది తీసుకెళ్లిన సరుకులను తిరిగి సేకరిస్తానని సమాధానమిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్స్

- విద్యార్థులకు ప్రగతిపత్రాల అందజేత
- నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ తదితర పాఠశాలల్లో చివరి పనిదినం సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించారు. ఈసమావేశంలో విద్యార్థుల అకాడమిక్ సామర్థ్యాల సాధనపై తల్లిదండ్రులకు సూచనలిచ్చారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలిపారు. ఇటీవల ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు నిర్వహించారు. అందులో వచ్చిన మార్కుల ప్రగతిపత్రాలను ఆన్‌లైన్‌లోనూ సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ క్యూమిలేటివ్ ప్రగతి పత్రాలను ప్రతీ పాఠశాలలోనూ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు అందించారు. కొన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు కొంతమేర హాజరు కాగా.. మరికొన్ని పాఠశాలల్లో అంతంత మాత్రంగానే.. హాజరైనట్లు సమాచారం. పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు ప్రగతిపత్రాలు అందించారు. విద్యార్థులకు తల్లిదండ్రులకు హెచ్‌ఎంలు పలు సూచనలు చేశారు. సోమవారంతో ఈవిద్యా సంవత్సరం ముగిసింది. ఈనెల 25 నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు సెలవులు. మళ్లీ పాఠశాలలు జూన్ 12న రీ ఓపెన్ చేస్తారు. అయితే జూన్ ఒకటి నుంచి బడిబాట ఉండే అవకాశం ఉండే అవకాశం ఉంది.



నారాయణగిరి స్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశం

విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

- స్తంభం ఎక్కి పని చేస్తుండగా విద్యుత్ షాక్

గార్ల: విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని పోచారంలో చోటుచేసుకుంది. విద్యుత్‌శాఖ సిబ్బంది, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గార్ల మండలం పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వాంకుడోత్ ఉపేందర్ (43) గత 18 ఏళ్లుగా గార్ల విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత రాత్రి వీచిన గాలిదుమారం ఈదురుగాలులకు పోచారం పంచాయతీ పరిధిలో 11 కేవీ విద్యుత్‌స్తంభం ఒరిగి వేరే విద్యుత్ లైన్‌మీద పడింది. విధి నిర్వహణలో భాగంగా ఉపేందర్ పోచారం వెళ్లి ఎల్‌సీ తీసుకొని, వేరే లైన్ ఎల్‌సీ తీసుకోకుండా మరమ్మతు చేస్తుండగా విద్యుత్ షాక్ గురై స్తంభంపై నుంచి ఉపేందర్ కిందపడిపోయాడు. విషయం తెలిసిన వెంటనే విద్యుత్ ఏఈ మహేంద్రబాబు హుటాహుటిన ఉపేందర్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స జరుగుతుండగా పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. వైద్యం చేయిస్తుండగా ఉపేందర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఉపేందర్ (ఫైల్)

రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

విధి నిర్వహణలో మృతి చెందిన కాంట్రాక్ట్ ఉద్యోగి ఉపేందర్ కుటుంబానికి విద్యుత్‌శాఖ రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అదే విధంగా కుటుంబంలో ఒకరికి విద్యుత్‌శాఖలో ఉద్యోగం కల్పించాలని నాయకులు కందునూరి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, సక్రు, రామారావు కోరారు.